ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
బుధవారం 4 సెప్టెంబరు 2024



వరద నష్టంపై మానుకోట కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం



మరిపెడ మండలం పురుషోత్తమయగూడెం వద్ద కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్యేలు



సీతారాంతండాలో బాధిత కుటుంబంలోని చిన్నారితో మాట్లాడుతున్న రేవంత్

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం..

- అధికారుల అప్రమత్తతతో ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించగలిగాం
- మానుకోట జిల్లాలో 30వేల ఎకరాల్లో పంట నష్టం
- ప్రతీ ఎకరాకు రూ.10వేల పరిహారమిస్తాం
- మూడు తండాల తరలింపుతో మోడల్ కాలనీ
- సీతారాంతండా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- మహబూబాబాద్ కలెక్టరేట్‌లో వరద నష్టంపై సమీక్ష

మహబూబాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వర్షం సృష్టించిన బీభత్సంతో ఎవరూ అధైర్యపడొద్దని.. తమ ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని, మహబూబాబాద్ జిల్లాలో 28 సెంటీమీటర్ల వర్షం పడిందని, జలప్రళయం వచ్చినా అధికారులు అప్రమత్త వ్యవహరించి ఆస్తి, ప్రాణనష్టాన్ని కొంత మేరకు తగ్గించగలిగారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని సీతారాంతండాను మంగళవారం సందర్శించిన ఆయన బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. తొలుత పురుషోత్తమయగూడెం 365 జాతీయ రహదారిపై 1500 మీటర్ల మేరకు కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించి.. వాగు ఉధృతితో ఇసుకమేటలు వేసిన ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహబూబాబాద్ కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్కలతో కలిసి వర్షం, వరద నష్టంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మానుకోట జిల్లా వ్యాప్తంగా 30వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఇక వరద బీభత్సంలోనూ నిరంతరం సహాయక చర్యల్లో పాల్గొన్న రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. వరద ముంపునకు గురైన సీతారాంతండా వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించిన సీరోలు ఎస్సై నగేష్ అభినందనీయుడన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల జిల్లాలో నలుగురు మృతి చెందగా.. వారిలో ఇద్దరు మహబూబాబాద్ జిల్లా వారైతే.. మరో ఇద్దరు పక్క జిల్లా అయిన ఖమ్మానికి చెందిన వారని వివరించారు. అలాగే 215 పశువులు చనిపోయాయని, 45 ట్యాంక్‌లు, మూడు పక్కా ఇళ్లు, 15 కచ్చ ఇళ్లు కూలిపోయాయని, మరో 96 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, 125 గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందని, 680 మందిని వరద ముంపుప్రాంతాల నుంచి తప్పించి వసతి కల్పించామని వెల్లడించారు. చనిపోయిన ప్రతీ వ్యక్తి కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. పురుషోత్తమయగూడెం ఆకేరువాగులో కారు గల్లంతయి మృతి చెందిన యువ శాస్త్రవేత్త నూనావత్ అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ వారి స్వగ్రామం ఖమ్మం జిల్లా కారేపల్లి గంగారం తండాకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి, ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని ఆదేశించామన్నారు.



పొలాల మీదుగా కాలినడకన సీతారాంతండాకు వస్తున్న సీఎం, మంత్రులు

మూడుతండాల తరలింపుతో మోడల్ కాలనీ..

ప్రతీసారి వరద ముంపునకు గురయ్యే పురుషోత్తమయగూడెం శివారు సీతారాంతండాతో పాటు మరో రెండు తండాలను సురక్షిత ప్రాంతానికి తరలించి, ఒక మోడల్ కాలనీగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా తండాల వారికి ప్రత్యామ్నాయంగా ఇందిరమ్మ ఇళ్లు, పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నట్టు ప్రకటించారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన ప్రతీ ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మృతి చెందిన పశువులకు రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేల చొప్పున యజమానులకు నష్టపరిహారం అందజేయాలన్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోనే రూ.13కోట్ల నష్టం వాటిల్లిందని, ఇప్పటి వరకు జరిగిన విపత్తును ఎదుర్కొవడం ఒకటైతే.. ఇక ముందు మరేవిధమైన ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మునిసిపల్, పంచాయతీ రాజ్, వైద్య, రెవెన్యూ అధికారులు ముంపునకు గురైన ప్రాంతాల్లోని ఇండ్లు, రోడ్లు శుభ్రం చేయడానికి నల్లాలు, ట్యాంకర్ల ద్వార నీరందించాలని చెప్పారు. దోమల వ్యాప్తి, అంటు వ్యాధులు రాకుండా ఆరోగ్యశాఖ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఎక్కడైతే నష్టం జరిగిందో ఆ ప్రాంతాల పునరుద్ధరణకు అవసరమైతే

మిగతా 7వ పేజీలో..



రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ విమర్శలు

- రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 3 : వర్షాలతో రైతుల పంట దెబ్బతిని, ప్రజలు కష్టాల్లో ఉంటే ఆదుకునేది పోయి రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గంటల్లోనే 42సెంటీమీటర్ల వర్షం కురిసిందని, ఇంతటి విపత్తుఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ, జిల్లాలను పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారని, రోడ్డు మార్గంలో ప్రయాణిస్తూ నష్టాన్ని పరిశీలించి ప్రజలకు ఓదార్పునిస్తూ అండగా నిలుస్తున్నారని, అలాంటి నాయకుడిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. మంచి సలహాలు, సూచనలిస్తే స్వీకరిస్తామని, విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ దగ్గర రూ.వేల కోట్లు ఉన్నాయని, అందులో నుంచి రూ.వెయ్యి లేదా రూ.రెండు వేల కోట్లు ఇస్తే తాను కొంతకలిపి నష్ట పోయిన ప్రజల అవసరాలు తీరుస్తామన్నారు. ధ్వంసమైన రోడ్లు, ఇతరత్రా పనులను సత్వరమే మరమ్మతులు చేయించాలన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పని చేయడం వల్ల తక్కువ నష్టం జరిగిందని అహర్నిశలు శ్రమించిన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క



విపత్కర సమయాల్లో అధికారులు అంతా అప్రమత్తంగా ఉండి సేవలందించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు అందరినీ అప్రమత్తం చేశారని దాంతో నష్టం కొంతమేర తగ్గిందన్నారు. మానుకోట జిల్లాలో వర్షాలతో ఇళ్లలోకి నీరు చేరితే, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారని, వర్షాలతో నష్టం జరిగిన జిల్లాలకు తక్షణ సాయం కింద సీఎం రేవంత్‌రెడ్డి రూ.5కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ధ్వంసమైన రోడ్ల పునరుద్ధరణ కోసం పనులను వేగవంతం చేయాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత జిల్లాలో వర్షాలతో జరిగిన నష్టం, తీసుకు న్న సహాయక చర్యలపై కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పొ, ఎం.డేవిడ్, ఆర్డీవో అలివేలు పాల్గొన్నారు. మానుకోట మునిసిపల్ పరిధిలో దెబ్బతిన్న రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, నాలాల ఏర్పాటుకు రూ.15 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మునిసిపల్ చైర్మన్ రాంమోహన్ రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్ వినతిపత్రం అందించారు.



వరంగల్ 35 డివిజన్ మైసయ్యనగర్ ఇంటిలో చేరిన నీటిని చూపుతున్న మహిళ

రోజంతా జల్లులు

- ఇళ్లకే పరిమితమైన జనం
- పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు చేరుకుంటున్న బాధితులు



మండలాల వారీగా వర్షపాతం	
సంగెం	6.0మి.మీ
చెన్నారావుపేట	3.6 మి.మీ
వర్ధన్నపేట	2.6 మి.మీ
నెక్కొండ	3.4 మి.మీ
ఖిలావరంగల్	3.2 మి.మీ
రాయపర్తి	3.2 మి. మీ
పర్వతగిరి	0.0 మి.మీ
గీసుగొండ	12.6మి.మీ
వరంగల్	5.0 మి.మీ
ఖానాపురం	7.8 మి.మీ
నర్సంపేట	4.2 మి.మీ
నల్లబెల్లి	5.2 మి.మీ
దుగ్గొండి	8.2 మి.మీ

వరంగల్ సిటీ, సెప్టెంబరు 3: నాలుగు రోజులుగా వర్షం మంగళవారం కాస్త తగ్గుముఖం పట్టింది. రోజంతా నల్లని మబ్బులు కప్పి తుంపర వాన పడింది. రోజంతా వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇప్పటికే ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి వసతులు కల్పించారు. ప్రస్తుతం వర్షం తగ్గుముఖం పట్టడంతో బాధితులు తమతమ ఇళ్లకు ఇప్పుడిప్పుడే చేరుకుంటున్నారు. ఇళ్లలో బురద, తడిసిన నిత్యావసర వస్తువులు చూసి బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. సర్టిఫికెట్లు, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్ వస్తువులు వరదనీటిలో చిక్కుకోవడంతో భోరుమన్నారు. బాధితులు ఇళ్లను శుభ్రం చేసుకునే పనిలో మునిగారు. మరోపక్క ఉదయం నుంచి రాత్రి వరకు ఆకాశం మేఘావృతమై మబ్బుపట్టి చల్లటి గాలి వీచింది. దీంతో వృదుద్ధ ఇళ్లను వదిలి బయటకు రాలేదు. దీంతో రోడ్లపై జన సంచారం భారీగా తగ్గింది.





భద్రకాళి చెరువుతో భయం.. భయం..

- ఆందోళనకు గురవుతున్న లోతట్టు ప్రాంతాలు
- భయంతో బతుకుతున్న పోతననగర్ కాలనీలు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు3: వరంగల్ నగరంలో ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు భద్రకాళి చెరువు పూర్తిస్థాయిలో నిండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుకు పైభాగంలో ఉన్న కాలనీలు, గ్రామాల నుంచి నాలుగు రోజులుగా పెద్ద ఎత్తున నీరు భద్రకాళి చెరువులోకి చేరుతుండడంతో స్థాయికి మించి మత్తడి పోస్తోంది. దీంతో ఎప్పుడు కట్ట తెగి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది.

కిందటేడు భద్రకాళి చెరువు కుడిపక్కన ఉన్న పోతన నగర్ ప్రాంతంలో ఉన్న చెరువు కట్ట తెగిపోవడంతో పోతననగ్‌లో నివసించే సుమారు 200 కుటుంబాలు నీట మునిగాయి. చాలా మంది ఆస్తినష్టంతో పాటు ప్రాణనష్టం కూడా జరిగిందని తెలిపారు. ఇళ్లలో ఉన్న నిత్యావసర సరుకులు నీటిలో కొట్టుకుపోవడంతో తిండికి ఇబ్బందిగా మారిందని గత స్మృతులను గుర్తుకు చేశారు. దీంతో అధికారులు సుమారు 500 ఇసుక బస్తాలను అడ్డంగా వేశారు. అలాగే ఆగమేఘాల మీద బల్దియా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక నిధులతో బలహీన పడిన కట్టకు సమానంగా భద్రకాళి బండ్ నుంచి పోతన నగర్ వెనుక వరకు 200 మీటర్ల పొడవుతో పెద్ద సిమెంటు గోడను నిర్మించారు. కానీ ప్రతిపాదనలో సూచించిన విధంగా సిమెంటు గోడను సగం వరకు నిర్మించిన అధికారులు మధ్యలోనే వదిలేశారు. చెరువు కట్ట పైభాగంలో నిండిన నీరు కింది భాగంలో మురుగు కాలువ ప్రవహిస్తుండడంతో అక్కడి ప్రజలు ప్రమాదపుటంచుల్లో కాలం వెల్లతీస్తున్నారు.

ఈ క్రమంలో ప్రస్తుతం పోతననగర్ ప్రజలు పాత ప్రమాదాన్ని తలచుకుని ఆందోళన చెందుతున్నారు. అయితే అధికారులు తెగిన కట్ట ప్రాంతంలో తాత్కాలికంగా వేసిన ఇసుక సంచులపైనే అధికారులు భారం పెట్టుకున్నారు. కానీ పోతన నగర్ ప్రజలు ఎప్పుడు కట్ట తెగి ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బ్రతుకు జీవుడా అంటే జీవిస్తున్నారు.



బలహీనంగా ఉన్న భద్రకాళి కట్టకు అడ్డంగా వేసిన ఇసుక సంచులు



ఇంటికన్నె సమీపంలో రైల్వే ట్రాక్ వేలాడిన ప్రాంతంలో మట్టికట్ట పోస్తున్న యంత్రాలు

నిరంతరాయంగా..

- తాళ్లపూసపల్లిలో రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి
- గూడ్స్‌రైలుతో ట్రయల్‌రన్ నిర్వహణ
- ఇంటికన్నె వద్ద రాత్రింబవళ్లు యుద్ధప్రాతిపదికన పనులు
- పునరుద్ధరణ చర్యల్లో వెయ్యి మందికిపైగా సిబ్బంది

7



హైదరాబాద్‌లో మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడుతున్న నర్సంపేట నాయకులు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన నాయకులు

నర్సంపేట, సెప్టెంబరు 3: హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ సంఘటన మంత్రి చంద్రశేఖర్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను నర్సంపేటకు చెందిన బీజేపీ నాయకులు కలిశారు. జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు కలిశారు. నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత నిర్మాణ మార్పులపై వినతిపత్రాన్ని కిషన్‌రెడ్డి, ఇతర నేతలకు అందజేసినట్లు ప్రతాప్ తెలిపారు. పార్టీ అభివృద్ధి, సభ్యత్వ నమోదుపై చర్చించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేయాలని మంత్రులు సూచించారని తెలిపారు. మంత్రులు, ఎంపీతోపాటు బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బంగారు శ్రుతి, దుగ్యాల ప్రదీప్‌రావు, కాసం వెంకటేశ్వర్లులను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు బాల్నె జగన్, నాయకులు వనపర్తి మల్లయ్య, పంజాల రాము, కూమల్ల పృధ్వీరాజ్, మనీష్ పాల్గొన్నారు.



హేమానీ, బుజ్జి, నసీమా మృతదేహాలు

ముగ్గురిని బలి తీసుకున్న బొగ్గులారీ

- ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురి మృతి
- మృతుల్లో తొర్రూరుకు చెందిన దంపతులు, పాలకుర్తికి చెందిన మహిళ
- జనగామ జిల్లా వావిలాలలో ఘటన

7

బాధితులు అధైర్యపడొద్దు: కలెక్టర్

కరీమాబాద్, సెప్టెంబరు 3: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ధైర్యంగా ఉండాలని, వరద తగ్గుముఖం పట్టేవరకు పునరావాసంలోనే బాధితులు ఉండాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. వరద బాధితుల కోసం నగరంలోని పోతన నగర్ రోడ్ మార్వాడి మందిర్‌తోపాటు, అండర్ రైల్వేగేటు ప్రాంతం కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఆశ్రయం పొందుతున్న బాధితులను పరామర్శించారు. కాలనీల్లో వరద నీరు తగ్గేవరకూ పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని సూచించారు. భారీ వర్షాలకు నీట మునిగిన ఎన్‌టీఆర్ నగర్, సాయినగర్, బృందావన్ కాలనీ, సంతోష్‌మాతా కాలనీ, డీకే నగర్, ఎన్‌ఎన్ నగర్‌లకు చెందిన ముంపు బాధితులకు రెవెన్యూ శాఖ పర్యవేక్షణలో బల్దియా ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం, అల్పాహారం, భోజనం అందజేయడంతో పాటు దుప్పట్లు అందించామన్నారు. అనారోగ్యంబారిన పడకుండా ఉండటానికి వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాతావరణ శాఖ ఐడీఎం ముందస్తు సమాచారం మేరకు ఈనెల 5న మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పరిస్థితులు చక్కబడే వరకు ప్రజలు పునరావాస కేంద్రాలు విడిచి వెళ్లకూడదని కోరారు. కార్యక్రమంలో బల్దియా సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, తహసీల్దార్‌లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రంలోని బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్

5న ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 3: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5న జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం చేయనున్నట్లు డీఈవో ఎం.జ్ఞానేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హంటర్‌రోడ్ ఉర్సుగుట్ట వద్దగల ఓ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యఅతిథులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ(సీతక్క), ప్రజాప్రతి నిధులతోపాటు పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి, కలెక్టర్ సత్యశారదలు అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

శాస్త్రవేత్తలకు ఉత్తమ అవార్డులు, పురస్కారాలు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 3: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లో ఉత్తమ శాస్త్రవేత్తలకు అవార్డులు అందజేశారు. ఇందులో వరంగల్ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పనిచేస్తున్న ఇద్దరు శాస్త్రవేత్తలు, ఒక సీనియర్ అసిస్టెంట్‌కు అవార్డులు దక్కాయి. ఆ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ బీజే రావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ చైర్మన్ ఎం.రఘునందన్ చేతుల మీదుగా వారు అవార్డులను అందుకున్నారు. అవార్డు గ్రహీతలు ఐదేళ్లుగా అపరాల పంటలో నూతన కంది వంగడాలు, పంటలలో పురోగతి, విత్తనోత్పత్తిలో మెరుగైన కృషి చేసినందుకు శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సంధ్యాకిషోర్ మండవ వెంకటరామయ్య ఉత్తమ శాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు. వరిలో నూతన వంగడాల రూపకల్పనలో భాగస్వామ్యం అవడంతోపాటు వరిలో వచ్చే చీడపీడల నివారణ నిర్మూలనకు ఆధునిక పద్ధతిలో రూపొందించడంలో కీలక ప్రాత పోషించినందుకు వరి విభాగంలో కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఓంప్రకాష్ ఉత్తమశాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు. అలాగే వరంగల్ వ్యవసాయ ప్రాంతీయ పరిశోధనా స్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భూక్యా రమేష్ ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఓంప్రకాష్, సంధ్యాకిషోర్

డిగ్రీ విద్యార్థులకు ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ

పోస్టర్ ఆవిష్కరించిన కేయూ రిజిస్ట్రార్, ఆర్‌బీఐ అధికారి

కేయూక్యాంపస్, సెప్టెంబరు 3: డిగ్రీ విద్యార్థులకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా సువర్ణావకాశాన్ని కల్పించింది. క్విజ్‌లో పాల్గొని రూ.10 లక్షలు మొదటి, రూ.8లక్షలు రెండో బహుమతి, అలాగే రూ.6లక్షలు మూడో బహుమతిగా గెలుచుకునే బంపర్ ఆఫర్‌ను వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, ఆర్‌బీఐ అధికారి మహ్మద్ అలీ బాబాలు రిజిస్ట్రార్ చాంబర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. వర్సిటీ పరిధిలో డిగ్రీ చదువుతూ, 25 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ, యువకులు క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు క్యూఆర్ కోడ్ ద్వారా ఇద్దరు కలిసి గ్రూపుగా వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. క్విజ్ పోటీలు జాతీయ స్థాయిలో నాలుగు రౌండ్‌లుగా జరుగుతాయని తెలిపారు. మొదటి రౌండ్ ఆన్‌లైన్‌లో ఉంటుందని వెల్లడించారు. మొదటి రౌండ్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో రౌండ్‌కు అర్హత సాధిస్తారని, అయితే రెండో రౌండ్ రాష్ట్రస్థాయిలో జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే మూడో రౌండ్ జోనల్ స్థాయిలో జరుగుతోందని వెల్లడించారు. దీనిలో అత్యున్నత ప్రతిభ చూపిన వారికి జాతీయస్థాయిలో నాలుగో రౌండ్ జరుగుతుందని వివరించారు. 2, 3, 4వ రౌండ్‌లు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయని, ఆయా రౌండ్‌లకు ఎంపికైన వారికి రవాణా, భోజనం, ఇతర ఖర్చులను ఆర్‌బీఐ భరిస్తుందని పేర్కొన్నారు. కాగా, పోటీల్లో పాల్గొన్న వారందరికీ ఆర్‌బీఐ తరుపున సర్టిఫికెట్లను అందచేస్తారని తెలిపారు. ఇతర వివరాలకు www.rbi.org.inలో చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ అధికారి మహ్మద్ అలీబాబా, లీడ్ బ్యాంకు ఆఫీసర్ హవేలీరాజు, ఫైనాన్సియల్ లిటరసీ క్రెడిట్ కౌన్సిలర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, అధికారులు















అధైర్యం వద్దు.. అండగా ఉంటాం

(5వ పేజీ తరువాయి)

సమీప ప్రాంతాల రెవెన్యూ, పోలీసులను రప్పించి, రంగంలోకి దింపాలన్నారు. ఎక్కడైతే ప్రమాదాలు, వరదల నష్టం జరుగుతుందో ఆయా ప్రాంతాలను గుర్తించి బ్లూబుక్ తయారు చేసి కలెక్టరేట్‌లో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ముందుముందు ఇలాంటి విపత్తులు ఏర్పడే అవకాశం ఉంటే అధికారులు మారినా.. ఆ బ్లూబుక్‌లోని సమాచారం ద్వారా చరిత్ర పునరావృతం కాకుండా జాగ్రత్తపడే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజల మధ్యనే ఉండి ప్రజల కష్టనష్టాలను తెలుసుకుని అధికారులకు వివరించి అన్ని విధాలుగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. తమ ప్రభుత్వం బురద.. వరద రాజకీయాలు చేయదని, చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితుల సాయం కోసం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.



సీతారాంతండాలో వరద బాధితులతో మాట్లాడుతున్నసీఎం రేవంత్‌రెడ్డి

మానుకోటలోనూ హైడ్రా తరహా చర్యలకు ఆదేశం

మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, నాలాలు కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో అక్రమణల కూల్చివేతకు శ్రీకారం చుట్టిన హైడ్రా తరహాలోనే ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ నాలా చెరువులను ఆక్రమిస్తే కూల్చివేయడానికి కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని వెల్లడిచారు. చెరువులు, నాలాలు, బఫర్‌జోన్‌ల ఆక్రమణల వల్లనే భారీ వర్షాలు చోటు చేసుకున్నప్పుడు వరద ముంపుతో తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్రమంతా చెరువులు, నాలాల ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతామని చెప్పారు. ప్రకృతిని చెరబట్టాలని చూస్తే ప్రకృతి ప్రకోపాన్ని చూడాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్, తెలంగాణ, విజయవాడ, హైదరాబాద్ ఎక్కడైనా సరే ప్రకృతిమీద దాడిచేస్తే తప్పకుంటి దుష్ఫలితాలు చూడాల్సి వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు సంబంధించి హైకోర్టు ఇతరత్రా ఏ కోర్టుల్లో కేసులు ఉన్నా.. చట్టపరంగా, న్యాయపరంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులను ఆక్రమించిన భూ కబ్జాదారులు ఎంతటి వారైనా వదిలేది లేదని, ఎంతటి ఒత్తిడి వచ్చినా.. వెనక్కి తగ్గేదే లేదని తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. అక్రమంగా కట్టడాలు చేపట్టి ఉంటే వెంటనే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు. లేని పక్షంలో తామే చర్యలు తీసుకుని కూల్చివేయిస్తామన్నారు. చెరువులు, నాలలు ఆక్రమణలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, మామిడాల యశస్వినిరెడ్డి కోరం కనకయ్య, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్ పాల్గొన్నారు.

సీతారాంతండా బాధితులకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అండ



సీఎంకు తన జీతం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

మరిపెడ మండలం తండాధర్మారం శివారు సీతారాం తాండా ముంపు బాధిత కుటుంబాల సహార్థం కోసం పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన ఒకనెల వేతనం రూ.2.75 లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సీతారాంతండాలో సీఎం రేవంత్‌రెడ్డికి విరాళానికి సంబంధించిన చెక్కును మల్లన్న అందచేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్‌ఈలు కృష్ణారెడ్డి, సురేందర్, డీఈఈ అనూష, శ్రీనివాస్, మరిపెడ తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో విజయ, ఎంపీవో సోమ్లానాయక్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న విద్యార్థిని

కిడ్డీబ్యాంకులో దాచుకున్న రూ.3వేలను సీఎంకు అందజేసిన సాయిసింధు

మహబూబాబాద్ టౌన్ : వరదలో మహబూబాబాద్ జిల్లా అతలాకుతలమైన వేళ మహబూబాబాద్ పట్టణానికి చెందిన పదో తరగతి విద్యార్థిని చలించిపోయింది. తన తల్లిదండ్రులు పాకెట్ మనీగా ఇవ్వగా కిడ్డి బ్యాంకులో దాచుకున్న రూ.3వేలను వరద బాధితుల సహాయార్థం అందించి పెద్దమనుసును చాటుకుంది. మహబూబాబాద్ పట్టణానికి చెందిన ముత్యాల గీతవాణి- ప్రవీణ్‌కుమార్ దంపతుల కుమార్తె సాయిసింధు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన జిల్లావాసులకు అండగా ఉండేందుకు తాను దాచుకున్న డబ్బు రూ.3వేలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించేందుకు గాను మంగళవారం మానుకోటకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చింది. దీంతో సీఎం సింధును అభినందించారు.



సీఎం సహాయనిధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రూ.3వేలను అందిస్తున్న చిన్నారి సాయిసింధు

శరవేగంగా జాతీయ రహదారి మరమ్మతులు



శరవేగంగా సాగుతున్న జాతీయ రహదారి మరమ్మతు పనులు



వరద ఉధృతికి పాడైన జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మరిపెడ, సెప్టెంబరు 3 : భారీ వర్షాలతో ఆకేరు నది వరద ఉధృతితో మరిపెడ మండలం పీఎస్‌గూడెం దగ్గర పాడైన 365 జాతీయ రహదారి పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను మంగళవారం సీతారాంనాయక్‌తండాకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. పునరుద్ధరణ పనులు తాత్కలికంగా చేపట్టినప్పటికి మళ్లీమళ్లీ ఇలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ, పక్కా ప్రణాళికలతో నివేదికలు తయారు చేయాలని సూచించారు. జిల్లా అధికార యంత్రాం గం పీఎస్ గూడెం బ్రిడ్జి దగ్గర మూడు ప్రొక్లయినర్లను ఏర్పాటు చేసి, పనులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి రోడ్డు మార్గం పునరుద్ధరించేలా పనులు జరుగుతున్నాయి.

సీరోలు ఎస్సై నగేష్‌కు సీఎం సత్కారం



సీరోలు ఎస్సై నగేష్‌ను సత్కరిస్తున్న సీఎం, మంత్రులు

సీరోలు , సెప్టెంబరు 3 : వరదలతో నీట మునిగిన సీతారాంతండా ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించిన సీరోలు ఎస్సై నగేష్ సేవలు భేష్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించిన సీఎం సుమారు 100 మంది తండావాసులను సీరోలు ఎస్సై నగేష్ తన సిబ్బందితో కలిసి సురక్షిత ప్రాంతాలకు తరలించారని, ఈ క్రమంలో నడవలేని స్థితిలో ఉన్న 60 ఏళ్ల వృద్ధురాలిని కావడికి జోలెకట్టి స్వయంగా ఆయన కావడి మోసి సురక్షిత ప్రాంతానికి తరలించి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మంత్రులు పొంగులేటి, సీతక్కతో కలిసి నగేష్‌ను సత్కరించారు.

సీఎం పర్యటన సాగిందిలా..

మరిపెడ, సెప్టెంబరు 3 : మరిపెడ మండలంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన 32నిమిషాల పాటు కొనసాగింది. ఖమ్మం నుంచి రోడ్డుమార్గంలో మ ధ్యాహ్నం 12.54నిమిషాలకు సీతారాంతండా స్టేజీకి చేరు కున్న ఆయన తొలుత మంత్రులు, అధికారులతో కలిసి ధ్వంసమైన జాతీయ రహదారిని పరిశీలించారు. అక్కడి నుంచి కాలినడకన 1.03 నిమిషాలకు సీతారాంతండాకు చేరుకున్నారు. 10నిమిషాల పాటు పలువురు బాధితుల ఇళ్లకు వెళ్లి జరిగిన నష్టం గురించి తెలుసుకున్నారు. రోధిస్తున్న బాధిత కుటుంబాల వారిని ఓదార్చారు. 1.13 నిమిషాలకు బాధిత కుటుబాలను ఉద్దేశించి 11 నిమిషాలు వారితో మాట్లాడారు. 1.26 నిమిషాలకు కాన్వాయ్ ద్వారా మహబూబాబాద్ కలెక్టరేట్‌కు బయలుదేరి వెళ్లారు. 1:45 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న సీఎం ఫొటోప్రదర్శన తిలకించి 1:50 గంటలకు సమీక్ష ప్రారంభించారు. 2:35 గంటలకు సమీక్ష ముగించుకుని వెళ్లిపోయారు.

నిరంతరాయంగా..

- తాళ్లపూసపల్లిలో రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి
- గూడ్స్ రైలుతో ట్రయల్‌రన్ నిర్వహణ
- ఇంటికన్నె వద్ద యుద్ధప్రాతిపదికన పనులు
- పునరుద్ధరణ పనుల్లో వెయ్యి మందికిపైగా సిబ్బంది



ఇంటికన్నె సమీపంలో రైల్వే ట్రాక్ మరమ్మతు పనుల్లో కూలీలు

కేసముద్రం, సెప్టెంబరు 3 : ఇటీవలి భారీ వర్షం, వరద బీభత్సం కారణంగా సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య, కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య వరద ప్రవాహానికి ట్రాక్ ధ్వంసమై రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పడిన భారీ వర్షం కారణంగా తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య 432, 434 కిలోమీటరు వద్ద సుమారు 20 మీటర్ల పొడవు, అలాగే ఇంటికన్నె వద్ద 418 కిలోమీటరు వద్ద 40 మీటర్ల పొడవు రైల్వే ట్రాక్ వరద తాకిడికి ధ్వంసమైంది. ఫలితంగా శనివారం రాత్రి నుంచి సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్ల మధ్య రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో అప్రమత్తమైన రైల్వే శాఖ ఆదివారం సాయంత్రం నుంచే పట్టాల మరమ్మతు పనులు చేపట్టి నిరంతరాయంగా కొనసాగిస్తోంది. దీంతో తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య మంగళవారం ఉదయం వరకు ట్రాక్‌ను సిద్ధం చేసి మధ్యాహ్నం ట్రయల్ రన్‌లో భాగంగా గూడ్స్ రైలును కూడా నడిపించారు. ఇక ఇంటికన్నె వద్ద ట్రాక్ బాగా దెబ్బతినడంతో మరమ్మతు పనులకు సమయం పడుతోంది. సోమవారం ఉదయం నాటికి వరద ప్రవాహం కొంత తగ్గుముఖం పట్టడంతో ఎనిమిది ఎక్స్‌కవేటర్ యంత్రాలను తీసుకువచ్చి రైలు కట్ట పటిష్ఠం కోసం మంగళవారం సాయంత్రం వరకు మట్టికట్టను పోశారు. యంత్రాలతో కంకర నింపుతున్నారు. మరోవైపు ఇదే ప్రాంతంలో పాక్షికంగా దెబ్బతిన్న రైల్వే ట్రాక్ వద్ద సిబ్బందితో మరమ్మతులు చేయిస్తున్నారు. ఇక్కడ రైల్వే ఇంజనీరింగ్ కార్మికులు, ఓహెచ్‌ఈ(ఓవర్ హెడ్ ఎలక్ట్రికల్స్), కమ్యూనికేషన్స్ తదితర విభాగాలకు సంబంధించిన వెయ్యి మందికి పైగా సిబ్బంది మరమ్మతు పనుల్లో పాల్గొనడం గమనార్హం. మంగళవారం రాత్రి పట్టాలను ఏర్పాటు చేయడం, కంకర ప్యాకింగ్ పూర్తి చేసి బుధవారం మధ్యాహ్నం వరకు రైలు పట్టాల పునరుద్ధరణ జరిగే అవకాశం ఉందని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి.

రైళ్ల పునరుద్ధరణకు మరో రెండురోజులు!

కాజీపేట, సెప్టెంబరు 3: భారీవర్షాల నేపథ్యంలో ఇంటికన్నె-కేసముద్రం, తాళ్లపూసలపల్లి-మహబూబాబాద్ మధ్య రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో విజయవాడ వైపు వెళ్లే అన్ని రైళ్లను రద్దుచేసిన సంగతి తెలిసిందే. విజయవాడ వైపు వెళ్లే రైళ్లు మంగళవారం సైతం రద్దు చేశారు. ఆ రూట్‌లలో రైళ్లు పునరుద్ధరణకు మరో రెండురోజులు పట్టే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. తాళ్లపూసలపల్లి - మహబూబాబాద్ మధ్య దెబ్బతిన్న రైల్వే ట్రాక్‌ను రైల్వే సిబ్బంది రేయింబవళ్లు పనిచేయడంతో ఆ ట్రాక్‌ను మంగళవారం మరమ్మతును పూర్తి చేశారు. ఆ ట్రాక్‌పై ట్రయల్ రన్ సైతం పూర్తి చేశారు. ఇదే రూట్‌లో ఇంటికన్నె - కేసముద్రం మధ్య దెబ్బతిన్న రైల్‌ట్రాక్ పునరుద్ధరణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి, ఈ ట్రాక్ మరమ్మతులు పూర్తిచేస్తేనే ఆ రూట్‌లో రైళ్లు నడుప నున్నామని, అందుకు మరోరెండు రోజులు పట్టే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు.

ముగ్గురిని బలితీసుకున్న బొగ్గులారీ

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురి మృతి

- మృతుల్లో తొర్రూరుకు చెందిన దంపతులు, పాలకుర్తికి చెందిన మహిళ
- జనగామ జిల్లా వావిలాలలో ఘటన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి

పాలకుర్తి/తొర్రూరు రూరల్, సెప్టెంబరు 3 : మృత్యువై దూసుకొచ్చిన ఓ బొగ్గులారీ ముగ్గురిని బలితీసుకుంది. మూలమలుపు వద్ద ఆ లారీ బస్సును ఢీ కొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న దంపతులు సహా ఓ మహిళ మృతిచెందారు. మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామ శివారులో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డిపో నుంచి పాలకుర్తి- తొర్రూరు షటిల్ సర్వీసుగా ఓ ఆర్టీసీ బస్సు పాలకుర్తి నుంచి తొర్రూరుకు మొత్తం 18మంది ప్రయాణికులతో వెళుతోంది. ఈ క్రమంలో పాలకుర్తి మండలం వావిలాల గ్రామ శివారులో మూలమలుపు వద్ద తొర్రూరు నుంచి పాలకుర్తి వైపు వస్తున్న ఓ బొగ్గు లారీ ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం టీక్యాతండాకు చెందిన జాటోతు హేమాణి(55), బుజ్జి (50) దంపతులతో పాటు పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఎండి.నసీమా (55) మృతి చెందా రు. అలాగే జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును ఆరా తీశారు. అయితే బొగ్గులారీ డ్రైవర్ మద్యం మత్తులో బస్సు నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. ఈ ఘటనలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం టీక్యాతండాకు చెందిన జాటోతు బాలాజీ, వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన కోలపల్లి భూలక్ష్మీ, ఎర్ర సత్యవతి, పాలకుర్తి మండలం నారబోయినగూడెం గ్రామానికి చెందిన తిరుపల్లి నాగమ్మకు స్వల్ప గాయాలయ్యాయి.



తొర్రూరులో చికిత్స పొందుతున్న జాటోతు బాలాజీ

కుమారుడు, కూతురు వద్దకు వెళ్లి వస్తుండగా..

హేమాణి, బుజ్జి దంపతులు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తమ చిన్న కుమారుడు సుమన్, కుమార్తె అరుణలను చూసేందుకు నాలుగు రోజుల క్రితం మరో ఇద్దరు కుటుంబసభ్యులతోకలసి వెళ్లారు. తిరిగి హైదరాబాద్ నుంచి సోమవారం ఇంటికి బయల్దేరిన వారు సాయంత్రానికి దేవరుప్పల మండలం పెద్దతండా శివారు దోనెబండ తండాలో నివాసం ఉండే బుజ్జి సోదరి అయిన బానోతు రుక్కి ఇంటికి వెళ్లారు. రాత్రి అక్కడే బస చేసిన ఆ నలుగురు మంగళవారం తెల్లవారు జామున దోనెబండ తండా నుంచి పాలకుర్తి చేరుకుని.. అక్కడ తొర్రూరు వెళ్లే బస్సు ఎక్కారు. మార్గమధ్యలో వావిలాల వద్ద జరిగిన ప్రమాదంలో బస్సులో కుడివైపు కూర్చున్న హేమాని, బుజ్జి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో హేమానీ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాల పాలైన హేమాని భార్య బుజ్జిని తొర్రూరులోని ప్రైవేటు ఆసత్రికి తర లించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతులకు ఇద్ద రు కుమారులు సోములు, సుమన్, అరుణ ఉన్నారు. ఇక మరో మృతురాలు ఎండి. నసీమాది పాలకుర్తి మండల కేంద్రం. నసీమా తొర్రూరు మండలం నాంచారిమడూరు గ్రామశివారులోని మహాత్మాజ్యోతిబాపూలే డిగ్రీ గురుకుల కళాశాలలో ఔట్ సోర్సింగ్ వంట మనిషిగా పని చేస్తోంది. రోజులాగే విధులకు వెళ్లే క్రమంలో ఆమె ప్రమాదానికి గురైంది. నసీమాకు భర్త బడేసాబ్ కుమారులు యాకూబ్, మహబూబ్‌పాషా ఉన్నారు.

ఘటనా స్థలిని సందర్శించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ప్రమాద విషయం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ముగ్గురు మృతి చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆమె బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అయితే ఎమ్మెల్యే ఆస్పత్రిని సందర్శించిన సమయంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్‌కు ఫోన్ చేసి గైర్హాజరైన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మృతురాలు నసీమా భర్త బడేసాబ్‌తో మాట్లాడి ఓదార్చారు. బీఆర్‌ఎస్ తరుపున ఆదుకుంటామని భరోసానిచ్చారు.

లారీ డ్రైవర్ మద్యం తాగడమే కారణమా?

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టి ముగ్గురు మృతికి కారణమైన బొగ్గు లారీ డ్రైవర్ మద్యం సేవించి వాహనాన్ని నడపడం వల్ల ఈ ఘోర ప్రమాదం జరిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఘటనకు అరగంట ముందు సదరు డ్రైవర్ వావిలాల గ్రామంలో లారీ నిలిపి బెల్ట్ దుకాణంలో మద్యం తాగినట్లు తెలిసింది. ఆ డ్రైవర్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించగా.. ఘటన జరిగిన కొద్దిసేపటికే డ్రైవర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.

దంపతుల మృతితో టీక్యాతండాలో విషాదం

పాలకుర్తి మండలం వావిలాల గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తొర్రూరు మండలం మండలం వెల్లికట్టె గ్రామ శివారు టీక్యాతండాకు చెందిన జాటోతు హేమానీ(60) బుజ్జమ్మ(55) దంపతులు మృతిచెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే వీరు హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు సుమన్, కుమార్తె అరుణను చూసివచ్చేందుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ప్రమాదానికి గురై మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఎన్పీడీసీఎల్‌కు

తీరని నష్టం

- దెబ్బతిన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్, ఇన్సులేటర్లు
- సుమారు 5 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 2: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎన్పీడీసీఎల్‌కు తీరని నష్టం వాటిల్లింది. వరదనీటి ధాటికి పలు స్తంభాలు పూర్తిగా దెబ్బతినడం, నేలమట్టం కావడం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్, ఇన్సులేటర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాలకు ఆటంకం కలిగింది. విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదిక మరమ్మతుల చేపట్టి కమర్షియల్, డొమెస్టిక్ సర్వీసులకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూరు, నర్సింహులపేట, మరిపెడ, ఎల్లంపేట మండలాల్లో వర్షపాతం ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు ఎక్కువగా నష్టం జరిగింది. ఆకేరువాగు తాకిడికి ఉల్లంపల్లిలో 33 బై 11 కేవీ సబ్‌స్టేషన్ నీట మునగడంతో కంట్రోల్‌రూమ్, ప్యానల్స్, ఇతరత్ర సామగ్రి దెబ్బతిన్నాయి. జిల్లాలో ప్రవహిస్తున్న పాలేరు, ఆకేరు, మున్నేరు, పాఖాలవాగు తీరం వెంబడి ఉన్న వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి సుమారు 900 విద్యుత్ స్తంభాలు దెబ్బతినడంతో పాటు కొన్ని నెలకొరగగా, 150 పైగా ట్రాన్స్‌ఫార్మర్స్ నీట మునగడం, ప్లింత్ నుంచి నీటిలో పడిపోయాయి. తాత్కాలికంగా విద్యుత్ సరఫరా చేసేందుకు వీటిన్నింటి మరమ్మతులకు కలిపి సుమారు రూ.40 లక్షల వరకు అంచనా వేస్తుండగా పూర్తి స్థాయిలో మరమ్మతుల చేసేందుకు సమారు రూ.2కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. నివాసాలకు సరఫరా చేసే విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు విరిగిపడి చాలా చోట్ల తీగలు తెగిపోగా వెంటనే సిబ్బంది రంగంలోకి దిగి పునరుద్ధరించినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ అంతరాయాలు లేకుండా చేసే ప్రయత్నం చేశారు. కొన్ని చోట్ల సబ్‌స్టేషన్‌ల్లోకి నీరు చేరడంతో ప్రత్యామ్నాయ పద్ధతిలో పక్క సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్‌ను సరఫరా చేశారు.

స్వీయ నియంత్రణ ముఖ్యం

వినియోగదారులు ఎట్టిపరిస్థితుల్లో స్వయంగా విద్యుత్ మరమ్మతులు చేయరాదని వివిధ జిల్లాల సర్కిల్ అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, ఇంట్లోని స్విచ్ బోర్డులను తడిచేతులతో తాకరాదన్నారు. విద్యుత్ అంతరాయంతో పాటు విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య ఉన్నా.. విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 1912, 18004250028 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అర్ధరాత్రి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉన్నతాధికారుల అదేశాలతో విద్యుత్‌ను పునరుద్ధరించిన సిబ్బందిని ఆయా జిల్లాల ఎస్‌ఈలు ప్రత్యేకంగా అభినందిచారు.



ములుగు జిల్లాలో క్రేన్ సహాయంతో కొత్త పోల్‌ను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

దెబ్బతిన్న చోట వెంటనే పునరుద్ధరణ పనుల చేపట్టాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 3: మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ కర్నాటీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్‌ఈలు, డీఈలతో మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. మహబూబాబాద్, భూపాలపల్లి, ఖమ్మం జిల్లాల్లో వరదల కారణంగా చెట్లు విరిగిపడి చాలా చోట్ల విద్యుత్ తీగలు తెగడం, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నీటమునగడం, ఇన్సులేటర్లు దెబ్బతినడం జరిగాయన్నారు. వాటి పనులను వేగంగా పునరుద్ధరణ చేయాలని ఆదేశించారు. కావాల్సిన మెటీరియల్, సిబ్బందిని అందిస్తామన్నారు. మునిగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల వద్ద నీటి ప్రవాహం తగ్గిన తర్వాత పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నా యంగా మరొక సబ్‌స్టేషన్ నుంచి సరఫరా ఉండేలా ముందస్తుచర్యలు చేపట్టాలన్నారు. తద్వారా అంతరాయలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, టి.మధుసూ దన్, సీజీఎం రాజు చౌహాన్, జీఎంలు నాగప్రసాద్, మల్లికార్జున్, అన్నపూర్ణ, శ్రీనివాస్, అంకుశ్, డీఈలు అనిల్‌కుమార్, శ్రీధరాచారి, రమణారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నష్టం

భూపాలపల్లి జిల్లాలో 263 స్తంభాలు, 2 పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్, 9 డీటీఆర్‌లు దెబ్బతినగా సుమారు 1.60 లక్షల నష్టం వాటిల్లినట్లుగా విద్యుత్ అధికారులు అంచనా వేశారు. వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు 193 విద్యుత్ పోల్స్, 95 ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతినగా 1.20 లక్షల నష్టం వాటిల్లిందని, ఇంకా ఈ నష్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. జనగామలో 22 విద్యుత్ స్తంభాలు, 2 ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతినగా 2 లక్షల నష్టం వాటిల్లిందని అంచనాకు వచ్చారు. హనుమకొండ జిల్లాలో 18 పోల్స్, 23 ఇన్సులేటర్లు, 1 ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినగా రూ.1.8 లక్షల నష్టం జరిగిందని అధికారులు తెలిపారు.

మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య



మహేందర్ (ఫైల్)

ధర్మసాగర్, సెప్టెంబర్ 3: ఉరి వేసుకొని మొగిలిచర్ల మహేందర్ (38) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై పోచయ్య మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన మహేందర్ 18 ఏళ్ల కిందట రఘునాథపల్లి మండలం తాటికాయల గ్రామానికి చెందిన రమతో వివాహమైంది. గ్రామంలోనే లాండ్రీషాపు నడుపుకుంటూ ఇద్దరు జీవిస్తున్నారు. వీరికి సంతానం కాకపోవడంతో రమ మానసికంగా అనారోగ్యానికి గురైంది. దీంతో నాలుగు నెలల కిందట రమ తల్లిదండ్రులు ఆమెను పుట్టింటికి తీసుకెళ్లారు. దీంతో భార్య రావడం లేదని మనస్థాపం చెందిన మహేందర్ సోమవారం రాత్రి హనుమకొండలో ఉంటున్న తన అక్క స్వరూపకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. మంగళవారం తెల్లవారుజామున స్వరూప మహేందర్‌కు ఫోన్ చేయగా ఎంతకూ ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారికి ఫోన్ చేసి తమ్ముడు మహేందర్ ఫోన్ ఎత్తడం లేదని చెప్పడంతో వారు మహేందర్ ఇంటికి వెళ్లి కిటికీలోంచి చూశారు. మహేందర్ ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయన్ని మృతుడి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు తెలపడంతో వారు విచ్చేసి స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారాన్ని అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి విచ్చేసి మృత దేహాన్ని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో పడి రైతు గల్లంతు

నెక్కొండ మండలం గుండ్రపల్లి శివారులో ఘటన



గల్లంతైన రైతు అజీమత్

నెక్కొండ, సెప్టెంబరు 3: వాగు దాటుతుండగా రైతు గల్లంతైన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన షేక్ అజీమత్ (35) వ్యవసాయ పనుల కోసం వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటి బయలుదేరాడు. గ్రామ శివారులోని పట్టివాగు దాటుతుండగా నీటి ప్రవాహం పెరగడంతో వాగులో కొట్టుకుపోయాడు. సమీపంలోని రైతులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న నెక్కొండ తహసీల్దార్ రాజ్‌కుమార్, చెన్నారావుపేట ఎస్సై అరుణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని రైతు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అజీమత్‌కు భార్య చాందిని, కుమార్తె, కుమారుడు ఉన్నారు.





నాగవల్లి పత్రాలతో అలంకరణ

గీసుగొండ, సెప్టెంబరు 3: శ్రావణమాస చివరి మంగళవారం అమావాస్య రోజు ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని నాగవల్లి పత్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు, నవరస క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షచార్యులు ఆలయ కమిటీ చైర్మన్ బాబురావు, పాల్గొన్నారు.



మట్టి గణపతుల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యశారద

మట్టి గణపతులనే పూజిద్దాం : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 3: మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించడమే శ్రేష్ఠమని, మట్టిగణపతులే పర్యావరణహితమని కలెక్టర్ సత్యశారద అన్నారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు కలెక్టర్ మట్టి గణపతులు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. కృత్రిమ రసాయనాలు, రంగులతో తయారుచేసిన విగ్రహాలతో జలవనరులు కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. కాలుష్య నియంత్రణ మండలి 8అంగుళాల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసి పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నాయన్నారు. మన జిల్లాలో ఉచితంగా 2వేల విగ్రహాల పంపిణీకి కాలుష్య నియంత్రణ మండలి విగ్రహాలను సిద్ధం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, జీడబ్ల్యుఎంసీ అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాంతియుతంగా జరుపుకోవాలి : ఏసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతి

శంభునిపేట, సెప్టెంబరు3: గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని మామునూరు ఏసీపీ తిరుపతి కోరారు. మామునూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న గణేష్ మండప నిర్వాహకులతో మంగళవారం మామునూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు పోలీసుల అనుమతి పొందాలన్నారు. మండపాలను ఏర్పాటు చేసే ముందు స్థలం యజమానుల అనుమతి తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖకు సమాచారం అందించి విద్యుత్ కలెక్షన్ తీసుకోవాలని ఎలక్ట్రీషన్‌లతోనే విద్యుత్ సంబంధిత పనులు చేయించాలని సూచించారు. మండపాల వద్ద 24 గంటలు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజేలు ఏర్పాటు, పేకాట, మద్యం సేవించటం, లక్కీ డ్రాలు నిర్వహించటం, అసభ్యకరమైన నృత్యాలు, ఇతర మతస్థులను కించపరిచే ప్రసంగాలు చేయటం పూర్తిగా నిషేధమన్నారు. కార్యక్రమంలో మామునూరు సీఐ రవి కుమార్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, మామునూరు, గీసుగొండ, ఏనుమాముల, పర్వతగిరి, సంగెం, ఐనవోలు స్టేషన్‌ల ఎస్ఐలు, సిబ్బంది, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతి తీసుకోవాలి

గీసుగొండ, సెప్టెంబరు 3: గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించే మండపాలకు అనుమతి తీసుకోవాలని సీఐ బాబులాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకునేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజేలు పెట్టకూడదని హెచ్చరించారు. మండప వేదికలకు విద్యుత్ సరాఫరాలో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నలుగురు చైన్‌స్నాచర్ల అరెస్ట్

» బంగారు గొలుసు, బైక్ స్వాధీనం
» జల్సాల కోసమే దొంగతనాలు
» వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్



చోరీ వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, సెప్టెంబరు 3: గంజాయి, జల్సాలకు అలవాటుపడి చైన్ స్నాచింగ్‌కు పాల్పడున్న నలుగురిని అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. మంగళవారం మట్టెవాడలోని ఏసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ.. జల్సాలకు అలవాటు పడ్డ కాజీపేట దర్గాకు చెందిన సల్మాన్, అవినాశ్‌లు జూలై 30న కాజీపేట దర్గా నుంచి పల్సర్ వాహనంపై బయలుదేరి అదే రోజు రాత్రి సుమారు 10 గంటలకు మేదరివాడలోని పూజ సామగ్రి షాపులో వృద్ధ మహిళ ఆమె మేడలోంచి బంగారు గొలుసును ఆపహరించి బైక్‌పై సల్మాన్, అవినాశ్‌లు పరారైయ్యారన్నారు. అదేరోజు రాత్రి కాజీపేటకు వెళ్లి బైక్‌ను చెట్ల పొదల్లో దాచి సల్మాన్, అవినాశ్‌లు హైదరాబాద్‌కు వెళ్లి, అఫ్రోజ్‌ను కలిసి గొలుసును విక్రయించి, డబ్బులు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. అఫ్రోజ్ తన మిత్రుడు రఫీక్‌కు వాటా ఇవ్వాలని కోరగా, సల్మాన్, అవినాశ్‌లుని అందుకు నిరాకరించారన్నారు. హైదరాబాద్‌లో గొలుసును విక్రయించడానికి అవకాశం దొరకలేదన్నారు. దీంతో సోమవారం సల్మాన్, అవినాశ్, హైదరాబాద్‌కు చెందిన అఫ్రోజ్, రఫీక్ లు కాజీపేటలో బంగారం షాపులో గొలుసు విక్రయించేందుకు వెళ్తుండగా, పోలీసులను చూసి నలుగురు పారిపోతుండగా పట్టుకున్నట్టు తెలిపారు. నిందితుల నుంచి బంగారు గొలుసు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పర్చుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చైన్ స్నాచర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనపరచిన ఇంతేజార్‌గంజ్ ఎస్సైలు వెంకన్న, రాజు, క్రైంపార్టీ సిబ్బంది శివ, మహ్మద్ అలీ, ఉపేందర్, మహేందర్‌లను ఏసీపీ అభినందించారు. విలేకరుల సమావేశంలో ఇంతేజార్ గంజ్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్‌లు మచ్చ శివకుమార్, తుమ్మ గోపి పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, సెప్టెంబరు 3 : మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 24 మంది వాహనదారులకు జరిమానా తోపాటు ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్షను విధిస్తూ వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి విధించినట్లు మంగళవారం వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన 24మంది వాహనదారులకు రూ.41,100 జరిమానాతోపాటు, ఇద్దరు వాహనదారులకు జైలు శిక్ష పడినట్టు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురు వాహనదారులకు రూ.5000 జరిమానా వేసినట్టు వెల్లడించారు.

రేషన్ షాపులో తనిఖీలు



కాశిబుగ్గ రేషన్‌షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 3: జిల్లాలోని పలు చౌకధరల దుకాణాలను స్టేట్ టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. మంగళవారం వరంగల్ డివిజన్‌లోని పలు రేషన్ షాపులను తనిఖీలు చేసి వివరాలు సేకరించారు. లబ్ధిదారులకు అందుతున్న బియ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏనుమాముల మార్కెట్‌లోని స్టాక్‌పాయింట్‌ను తనిఖీ చేశారు. సివిల్ సప్లయిస్ రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ ఎంఏ రషీద్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ ఎన్.కిరణ్‌కుమార్ తదితరులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం



బొడ్రాయికి పూజలు చేస్తున్న నాయకులు

గిర్మాజీపేట, సెప్టెంబరు 3 : వరంగల్ నగరంలోని శ్రీగోవిందరాజుల గుట్ట బొడ్రాయి 14వ వార్షికోత్సవం మంగళవారం సంప్రదాయబద్ధంగా జరిగింది. కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయం నుంచే బొడ్రాయిని పసుపు, కుంకుమ, గంధం, పుష్పాలతో అలంకరించి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్ రాజ్, కార్పొరేటర్ అనిల్ కుమార్, మాజీ కార్పొరేటర్ జారతీ రమేష్, మీసాల ప్రకాష్, చింతాకుల సునీల్ కుమార్‌లు బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యిప్పఆదినారాయణ, కొమ్ము రాజ్‌కుమార్, శరత్, పల్లం రవి, సదానందం, చారి, గోపి, రాజ్‌కృష్ణ, అన్వేష్, సాగర్, మహేష్, చందర్, గణేష్, పరశురాం, వీరన్న, పద్మ, శైలజ పాల్గొన్నారు.

ప్రజా వినతుల స్వీకరణ



ప్రజా వినతులు స్వీకరిస్తున్న మురళీధర్‌రావు

వరంగల్‌సిటీ, సెప్టెంబరు 3: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ప్రజా వినతులను స్వీకరించారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని నివాసంలో కొండా మురళీధర్‌రావు ఉదయం నుంచి సాయంత్రం వరకు తూర్పు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి విజ్ఞప్తులను స్వీకరించారు. బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని ఇస్తున్న ఎన్నికల కన్వీనర్ అశోక్

ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా శ్రీనివాస్

మట్టెవాడ, సెప్టెంబరు 3: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులుగా కాశిబుగ్గ ప్రాంతానికి దుబ్బ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కన్వీనర్, మహాసభ రాష్ట్ర కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం వరంగల్‌లోని పాత బీటూబజార్‌లోని ఓప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలు ప్రక్రియ జరిగింది. ఒకటే నామినేషన్ రావడంతో శ్రీనివాస్ తోపాటు ప్రధాన కార్యదర్శిగా గర్లపాటి నగేంద్రబాబు, కోశాధికారిగా గందె శ్రీనివాస్ గుప్తాలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కన్వీనర్ ప్రకటించారు. నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గార్లపాటి శ్రీనివాస్, దాచేపల్లి సీతారాం, మంచాల కృష్ణమూర్తి, దొంతుల శోభన్, రాజమౌళి, నారాయణ, సోమ అశోక్, సదాశివుడు, కృష్ణమూర్తి, రవీందర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలుడి మృతి



వర్ధన్నపేట, సెప్టెంబర్ 3: వర్ధన్నపేట పట్టణ పరిధిలోని భవాణికుంట తండాకు చెందిన బాలుడు అనారోగ్యంతో మృతిచెందాడు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేట పట్టణ శివారు భవాణికుంటతండాకు చెందిన సునావత్ శ్రీను కుమారుడు సాత్విక్(7) మండలంలోని ఇల్లందలోని ఓ ప్రవేటు పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. పచ్చకామెర్లు రావడంతో పది రోజులుగా ఇంటి వద్దనే మందులు వాడుతున్నాడు. సోమవారం రాత్రి 8 గంటలకు వర్ధన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆసుప్రతికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించాలని సూచించారు. అక్కడకు తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతిచెందాడని నిర్ధారించారు.

సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి

శంభునిపేట, సెప్టెంబరు 3 : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రకాశ్ అన్నారు. మంగళవారం బొల్లికుంట కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు భవిష్యత్తులో రాబోయే ఉపాధి అవకాశాలపై సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో భవిష్యత్తులో రాబోయే ఉద్యోగాలను రూపొందించటానికి కళాశాలలో 140 గంటల శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. అందుకు అనుగుణంగా మెర్న్‌స్టాక్‌తో ఆధునిక వెబ్ అప్లికేషన్‌లను రూపొందించి డొమైన్ ఐఆర్ 4.0 నైపుణ్యాలను విద్యార్థులకు అందించమే లక్ష్యంగా శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ సత్యవతి, డాక్టర్ తన్వీర్ జహన్, డాక్టర్ ఆయేషా భాను, ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌లు బర్కత్, శేఖర్ పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకురావాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రవణ్‌కుమార్

మట్టెవాడ, సెప్టెంబరు 3: మనవ శరీరాన్ని వృథాగా మట్టిలో పోనివ్వకుండా అవయవ దానానికి ప్రతీ ఒక్కరు ముందుకురావాలిన, దీనిపై అవగాహన పెంచుకోవాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ కోరారు. మంగళవారం ఏవీవీ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్ అధ్యక్షతన జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా నేత్ర, అవయవ దానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. సదాశయ ఫౌండేషన్ 16ఏళ్లుగా అవయవ దానాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో నేత్రదాన పక్షోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోడిమ్యాల శ్రీనివాస్, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వకులభరణం శ్రీనివాస్, అభ్యుదయ సేవాసమితి అధ్యక్షుడు పరశురాములు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ



ఖిలావరంగల్, సెప్టెంబరు3: శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అమెరికాలో ఉన్న కందగట్ల వశిష్ట మనవడి పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్‌ను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగా శ్రవణ్‌కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.జయ్‌కుమార్, శారదా ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గుమ్మడవెళ్ళి సురేష్, బాలుడి తాత కందగట్ల రాంప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం కోసం ఎదురుచూపు

● నర్సంపేటలో భారీ బందోబస్తు ● సీఎం కోసం దారి వెంట జనం ఎదురుచూపు



సీఎం వెళ్తున్న బస్సు

నర్సంపేట నుంచి వెళ్తున్న సీఎం కాన్వాయ్.. దారివెంట నిలిచిన జనం

నర్సంపేటటౌన్, సెప్టెంబరు3: మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం ఉదయం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి నర్సంపేట మీదుగా మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో హన్మకొండకు తరలివెళ్లారు. సీఎం మహబూబాబాద్ జిల్లాలో పర్యటన ముగించుకొని నర్సంపేట మీదుగా హన్మకొండకు వెళ్తారన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో నర్సంపేట సబ్ డివిజన్ పోలీసులు అలెర్ట్‌అయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంతోపాటు, గిర్నిబావి వరకు అడుగడుగునా పోలీసులు మోహరించారు. నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుల్స్ బందోబస్తులో పాల్గొన్నారు.

మెడికల్ వైద్యకళాశాలలో కలెక్టర్ ఎదురుచూపు..

నర్సంపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన వైద్యకళాశాలను సందర్శిస్తారేమోనని భావించిన కలెక్టర్ సత్యశారద, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ తదితర అధికారులు మంగళవారం మెడికల్ కళాశాలలో వేచి ఉన్నారు. సీఎం నేరుగా హన్మకొండకు వెళ్లడంతో కలెక్టర్, ఇతర అధికారులు తిరిగి వరంగల్‌కు వెళ్లారు.

» ఖానాపురం: సీఎం మహబూబాబాద్ నుంచి హైదరాబాద వెళ్లే క్రమంలో ఖానాపురం మండలంలోని వేపచెట్టుతండా, మంగళవారిపేట, బుధరావుపేట, ఖానాపురం మీదుగా సీఎం కాన్వాయ్ వెళ్లింది. పోలీస్‌లు అప్రమత్తమై కాన్వాయ్ సాఫీగా వెళ్లేలా జాగ్రత్తలు ఈసుకున్నారు.

సీఎంను తిలకించేందుకు దారిపొడవునా ప్రధాన కూడల్లో ప్రజలు వేచి ఉన్నారు. వర్షం కారణంగా సీఎం ప్రయాణించే వాహనం అద్దాలు మూసి ఉం డటంతో సీఎం కనిపించకపోవడంతో అసంతృప్తికి గురయ్యారు.

వర్షం ఎఫెక్ట్

పునరావాస కేంద్రాల నుంచి

ఇళ్లకు చేరిన అర్చకులు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 3: భారీ వర్షం ఎప్పుడు వచ్చినా ముల్లెముటా సర్దుకుని, పిల్లాపాపలతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని భద్రకాళి ఆలయ అర్చకులు వాపోతున్నారు. భద్రకాళి దేవాలయానికి వెళ్లే రహదారిలో బ్రిడ్జి దాటాక పరిసర ప్రాంతాలు భారీ వర్షానికి నీటమునుగుతున్నాయి. కాగా, రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు శనివారం రాత్రి వర్షం ప్రారంభం మట్టెవాడ పోలీసులు ముందస్తుగా ఆ ప్రాంత వాసుల్ని సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు. ఎప్పుడు వర్షం పడినా ఇదే దుస్థితి అని అర్చకులు వాపోయారు. పోలీసుల ఆదేశాలతో ఆరుగురు అర్చకులం కుటుంబాలతో కలిసి సమీపంలోనే ఉన్న మార్వాడీలకు చెందిన దేవాలయంలో ఆశ్రయం పొందామని అర్చకుడు రాము తెలిపారు. ఆరు కుటుంబాలకు చెందిన దాదాపు 35మంది కుటుంబ సభ్యులం 48 గంటలపాటు అంజనేయ స్వామి దేవాలయంలో పునరావాసం ఉన్నామన్నారు. మంగళవారం ఉదయం వర్షపు నీరు తగ్గడంతో ఇళ్లకు వెళ్లినట్టు వెల్లడించారు.

ముంపు బాధితులకు దాతల చేయూత



బాధితులకు ఆహారం అందిస్తున్న కార్పొరేటర్

శంభునిపేట, సెప్టెంబరు 3: ముంపు ప్రాంతాల ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటామని 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మస్వామి అన్నారు. కాశీకుంట ప్రాంతానికి చెందిన ముంపు బాధితుల కోసం స్థానిక ప్రార్థన మందిరంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆహారం, దుప్పట్లను బాధితులకు అందించారు. వైద్య పరీక్షలు చేయించి, మందులు పంపిణీ చేశారు. శంభునిపేట గిరిప్రసాద్‌నగర్, ఎంఎం నగర్ ప్రాంతాల్లోని ముంపు బాధితులకు కార్పొరేటర్ సువర్ణ సురేష్ దుప్పట్లు, ఆహారాన్ని అందించారు.

» ఉర్సు బొడ్రాయి ప్రాంతంలోని శిథిలావస్థలో ఉన్న ఇంటిని మంగళవారం కార్పొరేషన్ సిబ్బంది నేలమట్టం చేశారు. ప్రమాదకరం ఉన్న ఇళ్లను కూల్చివేసుకోవాలని కార్పొరేటర్ పోశాల పద్మ సూచించారు. కార్యక్రమంలో అధికారులు అవి నాష్, కరుణాకర్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట క్షేత్రాల్లో పర్యటన

శంభునిపేట, సెప్టెంబరు 3 : వర్షాలకు పంటలు నీటమునిగిన రైతులు అధైర్య పడవద్దని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న సూచించారు. మంగళవారం కేవీకే శాస్త్రవేత్తలు పలు గ్రామాలను సందర్శించి రైతులకు నష్ట నివారణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఐనవోలు మండలం ఒంటి మామిడిపల్లి, సింగారంలో పర్యటించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజన్న, డాక్టర్ సౌమ్య, రాజు పాల్గొన్నారు.



ఒంటిమామిడిపల్లిలో పంట పరిశీలస్తున్న శాస్త్రవేత్తలు



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL బుధవారం 4 సెప్టెంబరు 2024

వరంగల్ రూరల్



తెగిన చెరువు మత్తడిని మరమ్మతులు చేస్తున్న అధికారులు

చెరువు మత్తడికి మరమ్మతులు

రాయపర్తి, సెప్టెంబరు 3 : మండలకేంద్రంలోని రామచంద్రుడి చెరువు మత్తడి తెగిపోగా, మంగళవారం చెరువు మత్తడి వద్ద తాత్కాలిక మరమ్మతు పనులు నిర్వహించారు. ఐబీ డీఈ కిరణ్ కుమార్ ఏఈ బాలదాస్, నందకిషోర్‌ల ఆధ్వర్యంలో రైతులతో కలిసి జేసీబీ సహాయంతో నీరు దిగువకు వెళ్లకుండా అడ్డుకట్ట చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

పంట నష్టంపై వ్యవసాయాధికారుల సర్వే

నెక్కొండ, సెప్టెంబరు 3 : వర్షాల కారణంగా దెబ్బ తిన్న పంటల వివరాలను తెలుసుకొనుటకు ప్రాథమిక సర్వేను జరుపుతున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి కే. అనురాధ తెలిపారు. మండలంలోని రెడ్లవాడ శివారులోని వ్యవసాయ క్షేత్రాల్లో సాగుచేసిన పంటల వివరాలను, వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలు, సాగు చేసిన రైతుల వివరాలను సేకరించనున్నట్లు చెప్పారు. అయితే వర్షాలు పూర్తిగా తగ్గక పోవడంతో పంటల నష్టం సర్వే జాప్యం జరుగుతుందంటూ అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు. సర్వే నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులకు రైతులు సహరించాలని కోరారు. ప్రాథమిక సర్వే ప్రకారం మండలంలో 1,900 వందల ఎకరాల్లో వరి, 2,100 వందల ఎకరాల్లో పత్తి, 410 ఎకరాల్లో మక్కజొన్న పంట నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగరాజు, ఏఈవో, రైతులు పాల్గొన్నారు.

వార్డుల వారీగా ఓటరు విభజన చేయాలి

చెన్నారావుపేట, సెప్టెంబరు 3: రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వార్డుల వారీ గా ఓటరు విభజన చేయాలని జడ్పీసీఈవో రాంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జోజిపేట నాయరమణతండాలో ఓటరు విభజనను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికల కోసం ఓటరు లిస్టును సిద్ధం చేయాలన్నారు. కుటుంబలోని వారందరి ఓట్లు ఓకే చోట ఉండేలా జాబితాను సిద్ధం చేయాలన్నారు. అనంతరంగా గ్రామంలోని పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 3 : నర్సంపేట మండలంలోని 27 గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదికను స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకంలో మండలంలోని గ్రామా ల్లో 2023, ఏప్రిల్ 1 నుంచి 2024 ఏప్రిల్ 31 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ నిర్వహించాయి. ఆయా గ్రామాలలో గ్రామసభలు పూర్తి చేసిన తర్వాత తుది నివేదికను సమర్పించేందుకు ప్రజావేదికను ఏర్పాటు చేశారు. డీఆర్‌డీవో కౌసల్య ఆధ్వర్యంలో జిల్లా, మండల స్థాయి అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో ఫాతిమామేరి, పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలుడి మృతి



మృతిచెందిన సాత్విక్

వర్ధన్నపేట, సెప్టెంబర్ 3: వర్ధన్నపేట పట్టణ పరిధిలోని భవాణికుంట తండా కు చెందిన బాలుడు అనారోగ్యంతో మృతిచెందాడు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలి పిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేట పట్టణ శివారు భవాణికుంటతండాకు చెందిన సునావత్ శ్రీను కుమారుడు సాత్విక్ (7) మండలంలోని ఇల్లందలోని ఓ ప్రవేటు పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. పచ్చకామెర్లు రావడంతో పది రోజులుగా ఇంటి వద్దనే మందులు వాడుతున్నాడు. సోమవారం రాత్రి 8 గంటలకు వర్ధన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆసుప్రతికి తీసుకెళ్లగా వైద్యుడు పరిశీలించి పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించాలని సూచించారు. అక్కడకు తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతిచెందాడని నిర్ధారించారు.

వర్క్‌షాపును సద్వినియోగం చేసుకోవాలి

నర్సంపేట, సెప్టెంబరు 3 : మండలంలోని బిట్స్ కళాశాలలో ఫ్రంట్ ఎండ్ డెవలప్‌మెంట్ విత్ జావా స్క్రిప్ట్‌పై టాస్క్ సహకారంతో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటుజరిగే వర్క్‌షాపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బిట్స్ చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి అన్నారు. వర్క్‌షాపును ప్రారంభించిన అనంతరం జరిగిన కార్య క్రమంలో ఆయన మాట్లాడారు. ఫ్రంట్‌ఎండ్ అండ్ డెవలప్‌మెంట్ విత్ జావా స్క్రిప్ట్ టెక్నాలజీ ఉపయోగాలను, ఉద్యోగ అవకాశాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్.హరిహరన్, వర్క్‌షాపు రిసోర్స్ పర్సన్ పవన్‌కళ్యాణ్, ఇంటర్‌నెట్ ఆఫ్‌థింగ్స్ విభాగాధిపతి ఎం.శ్రీధర్, ఏవో సురేశ్, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట మీదుగా హన్మకొండకు..

• ప్రయాణించిన సీఎం రేవంత్‌రెడ్డి • పోలీసుల అలెర్ట్

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 3 : మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం ఉదయం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లా నర్సంపేట మీదుగా మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో హన్మకొండకు తరలివెళ్లారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో నర్సంపేట సబ్ డివిజన్ పోలీసులు అలెర్ట్ అయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నర్సంపేట పట్టణంలోని ఖానాపురం రోడ్డు, బైపాస్‌రోడ్, అమరవీరుల స్థూపం, వరంగల్‌రోడ్ నుంచి దుగ్గొండి మండలం గిర్నిబావి వరకు అడుగడుగునా పోలీసులు భారీగా మోహరించారు. నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుల్స్ బందోబస్తులో పాల్గొన్నారు.

నర్సంపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన వైద్యకళాశాలను సందర్శిస్తారేమోనని భావించిన కలెక్టర్ సత్యశారద, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ తదితర అధికారులు మంగళవారం మెడికల్ కళాశాలలో వేచి ఉన్నారు. కానీ సీఎం మహబూబాబాద్ నుంచి నేరుగా హన్మకొండకు వెళ్లడంతో కలెక్టర్, ఇతర అధికారులు తిరిగి వరంగల్‌కు వెళ్లారు.

● ఖానాపురం: సీఎం రేవంత్‌రెడ్డి మహబూబాబాద్ పర్యటన ముగించుకొని రోడ్డు మార్గం ద్వారా మహబూబాబాద్ నుంచి హైదరాబాదు వెళ్లే క్రమంలో ఖానాపురం మండలంలోని వేపచెట్టుతండా, మంగళవారిపేట, బుధరావుపేట, ఖానాపురం మీదుగా సీఎం కాన్వాయ్ వెళ్లింది. ఈ సందర్భంగా పోలీస్‌లు అప్రమత్తమై కాన్వాయ్ సాఫీగా వెళ్లేవిధంగా జాతీయ రహదారిపై ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాన్వాయ్‌లో ఉన్న సీఎంను తిలకించేందుకు దారిపొడవును ప్రధాన కూడల్లో ప్రజలు వేచి ఉన్నారు. వర్షం కారణంగా సీఎం ప్రయాణించే వాహనం అద్దాలు మూసి ఉండటంతో సీఎం కనిపించకపోవడంతో ప్రజలు అసంతృప్తికి గురయ్యారు. పరకాల ఇన్‌చార్జి ఏసీపీ కిషోర్, నెక్కొండ ఇన్‌చార్జి సీఐ చంద్రమోహన్, ఖానాపురం, శాయంపేట, ఆత్మకూరు ఎస్సైలు రఘుపతి, ప్రమోద్, పరమేశ్వర్లు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నర్సంపేట మీదుగా వెళ్తున్న సీఎం క్యాన్వాయ్

చెరువును రిజర్వాయర్‌గా మార్చొద్దు

ముంపుగ్రామాల ప్రజలు నష్టపోతారు

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, సెప్టెంబరు 3 : రంగాయ చెరువును రిజర్వాయర్‌గా మార్చి ముంపు గ్రామాల ఇళ్లు, వ్యవసాయ భూములను ముంచొద్దని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగాయ చెరువును రిజర్వాయర్ మార్పు చేసే అంశంపై ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఎన్నికల్లో ప్రజలకు ఏమైనా హామీ ఇచ్చారా.. ప్రజలు, రైతుల, ప్రజా సంఘాల నుంచి ఏమైనా ప్రతిపాదనలు వచ్చాయా.. అని సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎవరి నుంచి ఎలాంటి ప్రతిపాదన రానప్పుడు మళ్లీ రిజర్వాయర్ ప్రస్తావన చేయడంలో ఎమ్మెల్యే ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న కాలువలను మరమ్మతులు చేస్తే రైతులందరికీ నీరు సమృద్ధిగా అందుతుందని తెలిపారు. అంతేగాని రంగాయ చెరువును రిజర్వాయర్‌గా మార్పు చేసి ముంపు గ్రామాల ప్రజల ఇళ్లు, భూములు కోల్పోయే విధంగా చేసే ఆలోచనను మానుకోవాలని హితవు పలికారు. అలాగే విచారణ పేరుతో ముంపు గ్రామాల ప్రజలను పోలీసులు బయపెట్టడం, హెచ్చరించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముంపు గ్రామాల ప్రజలకు అండగా ఉంటుందని సుదర్శన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ సారంగపాణి, చెట్టుపల్లి మురళిధర్, కక్కర్ల శ్రీనివాస్‌గౌడ్, గందె శ్రీనివాస్‌గుప్తా, మామిళ్ల మోహన్‌రెడ్డి, కొత్తపల్లి కోటి లింగాచారి, నానబోయిన రాజారాం, గుమ్మడి వేణు, నాగెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను విస్మరిస్తున్న ప్రభుత్వం

ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట, సెప్టెంబరు 3 : బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను బూచిగా చూపి ప్రజాసమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు. విషజ్వరాల బారిన పడి ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేద న్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రజాసమస్యలపై ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ నాయకులు వంగల రాగసుధ, కొత్తకొండరాజమౌళి, కేశెట్టి సదానందం, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండి.మాషూక్, మహిళావిభాగం కన్వీనర్ బింధు తదితరులు పాల్గొన్నారు.

పంటలను కాపాడుకుందాం..

వర్ధన్నపేట, సెప్టెంబర్ 3 : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు పంటల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఈ విధానం వల్ల పంటలను కొంత వరకు కాపాడుకోవచ్చునని తెలిపారు. ప్రధానంగా పొలాల్లో నీరు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు నిరంతరంగా కురుస్తుంటే వేరుకుళ్లు, కాయకుళ్లు తెగుళ్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇందుకుగాను 3-5 గ్రాములు బావిష్టన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు.

వర్షాలు తగ్గిన తరువాత వాతావరణం పొడిగా ఉన్నపుడు ఈ మందును పిచికారి చేయాలని పేర్కొన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే 15 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ కలిపి ఎకరాకు చల్లుకోవాలి. మొక్కజొన్న రైతులు కత్తెర పురుగు నివారణకు ఎకరాకు ఐదు కిలోల 10జీ గుళికలు ఇసుకలో కలిపి సుడుల్లో వేస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయని వివరించారు. పత్తి నీట మునిగినపుడు కాయలు, పిందెలు రాలిపోయే ప్రమాదం ఉందన్నారు. పంటలో నీటిని తీసివేసి వర్షాలు తగ్గిన తరువాత 5 గ్రాములు పొటాషియం నైట్రేట్‌ను ఒక లీటర్ నీటిలో కలిపి ఎకరానికి 8 లీటర్ల మందు పిచికారి చేయాలని, లేదా 10 గ్రాముల యూరియాను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అనంతరం ఎకరానికి 30 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలని ఏవో తెలిపారు.

సుమన్‌కు గద్దర్ అవార్డు

దుగ్గొండి, సెప్టెంబరు 3: మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన రచయిత, కళాకారుడైన నెల్లుట్ల సుమన్‌కు ఇటీవల తొర్రూరులో గిద్దెగళం ఆధ్వర్యంలో నిర్వహించిన గద్దర్ స్మారక సభలో గద్దర్ అవార్డు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కాశీం, కళాకారుడైన గిద్దె రాంనర్సయ్యలు సత్కరించి ఆయనను అభినందించారు. ఈసందర్భంగా మంగళవారం సుమన్ మాట్లాడుతూ గద్దర్ అవార్డు అందించి సంత్కరించిన గిద్దె రాంనర్సయ్యకు ప్రొఫెసర్ కాశీం, క్రాంతిదళ్ పృథ్వీరాజ్, దరువు అంజన్న, యోజనలకు ధన్యవాదములు తెలిపారు.

చెన్నారావుపేటలో సునిల్‌కు..

చెన్నారావుపేట: మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన తాళ్ల సునిల్ గద్దర్ అవార్డును అందుకున్నారు. ఆయన తెలంగాణ సాంస్కృతిక సారధిగా, తెలంగాణ ఉద్యమ కారుడిగా, నర్సంపేట లెజెండ్ రచయితగా గుర్తింపు పొందారు. తొర్రూరులో గిద్దె దళం వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గద్దర్ అవార్డును అందుకోవటం జరిగింది. గద్దర్ అవార్డును అందుకోవటం పట్ల పలువురు ఆయనను ప్రశంసించారు.

దేవేందర్‌కు డాక్టరేట్

పర్వతగిరి, సెప్టెంబరు 3: మండలంలోని కొంకపాక గ్రామానికి చెందిన కోతుల దేవేందర్ డాక్టరేట్ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో శాస్త్ర పరిశోధకుడు 'డిజైన్ సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవల్యూషన్ క్యునోలైన్ డిరైవ్డ్ నావెల్ హెట్రో సైక్లిక్స్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ న్యూ మెథడ్స్'పై విశ్వవిద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణంరాజు సూపర్‌విజన్‌లో దేవేందర్ తన పరిశోధనాగ్రంధాన్ని పూర్తి చేసినందుకు గాను పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. దేవేందర్ ప్రస్తుతం హైదరాబాద్ చర్లపల్లిలోని డెవలప్‌మెంట్ వోసిమమ్ లాబొరేటరీ ఆర్గనైజేషన్‌లో సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు.

ఫార్మసీలో సింధూరికి డాక్టరేట్

గీసుగొండ: మనుగొండకు చెందిన గోపు విజయసింధూరికి ఫార్మసీలో తమిళనాడు రాష్ట్రంలోని అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఫార్మసీ విభాగంలో డాక్టర్ సెల్వముత్తు కుమార్ ఆధ్వర్యంలో నానో టెక్నాలజీ ద్వారా సహజ సిద్ధమైన మందులతో కాన్సర్‌కు చికిత్స అనే అంశంపై పరిశోధక పత్రాలను ఆమె యూనివర్సిటీకి సమర్పించారు. ఈ పరిశోధనకు గాను ఆమెకు డాక్టరేట్ లభించింది. డాక్టర్ పొందిన విజయసింధూరిని గ్రామస్థులు అభినందించారు.

మహిళాశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 3 : ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీసీ గోలి కొమురయ్య సూచించారు. మంగళవారం మండలంలోని ఉప్పరపెల్లి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమంలో భాగమైన పెరటి కోళ్లు, పాడి గేదెలు, మదర్ యూనిట్, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, మహిళా శక్తి క్యాంటిన్ ఏర్పాటు చేయుటకు అర్హత, ఆసక్తి గల లబ్ధిదారుల ఎంపిక చేయాలన్నారు. సకాలంలో బ్యాంకు రుణాలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీవోలు కట్ట రజిత, దాడి భవాని, వడి సంధ్య, తక్కళ్లపెల్లి శోభ, ఆకుల స్రవంతి పాల్గొన్నారు.

హైవేపై గుంతలు పూడ్చిన పోలీసులు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 3 : మండలంలోని ఇల్లంద, కట్ర్యాల గ్రామాల్లో వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు భారీ గుంతలు పడ్డాయి. పోలీసులు వాటిని మంగళవారం పూడ్చివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుంతలను పూడ్చినట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు

చెన్నారావుపేట, సెప్టెంబరు 3: మండలం కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సరోజ విద్యార్థులకు పరిసరా పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ గ్లోరి, సీహెచ్‌వో భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

చెన్నారావుపేట, సెప్టెంబరు 3: నేడు పాతమగ్దుంపురంలో దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళాను నిర్వహించనున్నట్లు నర్సంపేట డిపో మేనేజర్ ప్రసున్నలక్ష్మి మంగళవారం తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 8:30 నిమిషాల నుంచి 1 గంట వరకు బస్ పాసులు అందిస్తామన్నారు. అర్హులైన వారు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ పాస్‌ఫొటో, రూ. 50లను తీసుకొని రావాలన్నారు. మహిళా దివ్యాంగులు తప్పకుండా రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు.

పాఠశాలలో నిలిచిన నీరు తొలగింపు

దుగ్గొండి సెప్టెంబరు 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షం నీటిని జీపీ సిబ్బందితో ఎంపీడీవో అరుంధతి తొలగించారు. నీరు నిలిచి విద్యార్థులు ఇబ్బంది పడుతుండడాన్ని హెచ్‌ఎం రామస్వామి ఎంపీడీవో దృష్టికి తీసుకొని పోయారు. ఎంపీడీవో సందర్శించి నీటిని తొలగించాలని జీపీ సిబ్బందికి ఆదేశించి నీటిని తొలగింప చేశారు. పాఠశాలకు భగీరథ నీటి పైపులైన్ కనెక్షన్ ఇవ్వాలని మిషన్ భగీరథ ఏఈని ఆదేశించారు.

ఎకరాకు రూ.20వేలు పరిహారం అందించాలి

వర్ధన్నపేట, సెప్టెంబర్ 3 : తుఫాను వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేల పంటనష్ట పరిహారం అందించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి ఉమ్మడి జిల్లాలోని మహబూబాబాద్, వరంగల్, ములుగు, భూపాలపల్లి, హనుమకొండ జిల్లాల్లో వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణచర్యలు చేపట్టినప్పటికీ పంటనష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేలు ప్రకటించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలల కాలంలో ఎకరానికి ఇప్పటికే రూ.15వేలకుపైగా ఖర్చు చేశారని ఇందులో కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తుఫాను వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, అలాగే పశువులు కోల్పోయిన వారికి తగిన నష్టపరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో తక్షణమే పంటల బీమా అమలులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

వర్షాలతో దెబ్బతిన్న పంటలు

ఆందోళనలో రైతులు

చెన్నారావుపేట, సెప్టెంబరు 3: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు గ్రామాల్లోని పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని జల్లి, శంకరంతండా, అమీనాబాద్, చెన్నారావుపేటలోని పలు గ్రామాల్లో వరి పంటలు, పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బ తిన్నాయి. పత్తి కాయలు రాలి, మొక్కజొన్న నేలవాలింది. వరి పంటలో ఇసుక మేట వేసింది. పంట నష్టం జరిగిన గ్రామాలను వ్యవసాయ శాఖాధికారులు పరిశీలించి, పంట నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పర్వతగిరి, సెప్టెంబరు 3: తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతుభరోసా నిధులు అందించకపోవడంతో అప్పులు చేసి మరీ రైతులు పంటలు సాగు చేశారని, తుఫాన్ వల్ల తీవ్రంగా నష్టపోయారన్నారు. పంటలు నష్టపోయిన రైతులతో పాటు ఇండ్లు కూలిపోయిన వారికి అండగా నిలవాలన్నారు. పారా ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు క్వాలిఫై అయిన మండలంలోని కల్లెడకు చెందిన అథ్లెట్ జీవం జి దీప్తి పతకం సాధించాలని ఆకాంక్షించారు.

ఎలక్ట్రిక్ వీల్స్ అందజేత

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 3 : మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన శాలివాహనులకు మంగళవారం హైదరాబాద్‌లో ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ వీల్స్ అందించారు. గ్రామోద్యోగ్ వికాస్ యోజన పథకం కింద 2023 లో 20 మంది కుమ్మరి కులస్థులకు ట్రైనింగ్ ఇచ్చినవారికి కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎలక్ట్రిక్ వీల్స్ అందించారు.

ఈ కార్యక్రమంలో నాంపెల్లి యాకయ్య, నాంపెల్లి వెంకన్న, ఐలయ్య, భిక్షపతి, రాజు, శ్రీను, రవి, సోమయ్య, మొగిళి, వెంకటేశం, శ్రీను, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీఎస్ జిల్లా కన్వీనర్‌గా వివేకానంద



వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 3 : మండలంలోని బండౌతపురం గ్రామానికి చెందిన తాటికాయల వివేకానందను వరంగల్ జిల్లా తెలంగాణ అంబేడ్కర్ సంఘం కన్వీనర్‌గా నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో వర్ధన్నపేట మండల అధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా విశిష్ట సేవలు అందించి ప్రజల సమస్యలు పోరాటంచేశాడని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ప్రమాదాలకు గురికావొద్దు

దుగ్గొండి, సెప్టెంబరు 3: వర్షాలు కురుస్తున్నందున చెరువులకు చేపల వేటకు పోయి ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకోవద్దని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అండ్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు దండు చిరంజీవి అన్నారు. మండలంలోని మహ్మదాపురంలో సోమవారం చేపల వేటకు చెరువులోకి పోయి ప్రమాదానికి గురై చనిపోయిన రేగుల శోభన్‌బాబు మృతదేహానికి మంగళవారం నివాళులర్పించారు. శోభన్‌బాబు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలన్నారు. ఆయనతో చొప్పరి శోభన్, ఓరుగంటి తిరుపతి, దండు శ్రీనివాస్, రాజు, కర్ణాకర్, మేక నవీన్, నిరంజన్ ఉన్నారు.

వరద నీటికి కొట్టుకుపోయిన చేపలచెరువు

ఆదుకోవాలని రైతు వేడుకోలు



మడిపల్లిలో కొట్టుకుపోయిన చేపల చెరువు

నెక్కొండ, సెప్టెంబరు 3: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం కారణంగా నెక్కొండ మండలం మడిపల్లి గ్రామంలోని చేపల చెరువు వరద నీటికి కొట్టు కుపోయినట్లు రైతు బానోతు బాలాజీనాయక్ తెలిపాడు. ఈ మేరకు ఆయన మంగళవారం నెక్కొండ తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. సంవత్సరం క్రితం చేపల చెరువు ఏర్పాటు చేసి చేపలను పెంచుతుండగా ప్రస్తుతం చెరువులోని చేపలు కేజీ నుంచి రెండు కేజీల వరకు పెరగాయని తెలిపాడు. మరో రెండు రోజుల్లో మార్కెట్‌లో చేపలను విక్రయించాల్సి ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షం కారణంగా పెద్ద ఎత్తున్న ప్రవహించిన నీటి ప్రవాహంతో చెరువు పూర్తిగా కొట్టుకు పోయిందంటూ రైతు బాలాజీనాయక్ ఆవేదన వ్యక్తం చేశాడు. చెరువుతో పాటు సమీపంతో ఏర్పాటు చేసిన షెడ్డు, చేపల దాన కొట్టుకుపోయిందని చెప్పా రు. దీంతో రూ. 10 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు తెలిపాడు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూడాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశాడు.

నాగేంద్రుడికి నాగవల్లి పత్రాలతో అలంకరణ

గీసుగొండ, సెప్టెంబరు 3: శ్రావణమాస చివరి మంగళవారం అమావాస్య రోజు ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని నాగవల్లి పత్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు, నవరస క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షచార్యులు ఆలయ కమిటీ చైర్మన్ బాబురావు, పాల్గొన్నారు.